# సరిలేరు నీకెవ్వరు

- జ్యేష్ఠ

**అసలు పేరు ఐ.సిహెచ్.వి. బసవరాజు, ఇంజనీరింగ్‌లో మాస్టర్ పట్టా తీసుకుని, అధ్యాపక వృత్తి చేపట్టారు. పదిహేనేళ్లకే తన కథని "తెలుగు స్వతంత్ర"లో చూసుకున్నారు. చాలా చదివి, కొద్దిగానే రాసిన కొద్దిమందిలో జ్యేష్ఠ చెప్పుకోతగిన వారు. పాతికేళ్ల క్రితం ఆయన రాసిన యీ కథలో - స్త్రీలు ఇంటా బయటా కూడా ఎలా మగ్గిపోతారో సున్నితంగా చెప్పారు. పురుషుల ద్వేషానికి మహిళలు ఎలా బలి అవుతున్నారో నిశిత పరిశీలన, అవగాహన గల జ్యేష్ఠ లాంటి మేల్ రైటర్స్ శక్తివంతంగా రాశారనడానికి యీ కథ ఒక ఉదాహరణ.**

అనుకోకుండా నీళ్ళలో పడి రెండు మునకలేసి కాసిని మురికి నీళ్ళు గుటకేసి ఎలాగో బయటపడ్డ కుక్కపిల్లలు ఏం చేస్తాయి? అమాయకపు ఆశ్చర్యంతో కోపంతో కుయ్యిమంటూ ఒంటిని అంటిన నీటిని దులుపుకుంటాయి.

పిల్లలూ అంతే. తడిసిన కాకులూ "పిచికలూ" అంతే. మాట్లాడకుండా గింజుకుని నీళ్ళని దులిపేసుకుంటాయి.

ఆఫీసర్ వేణునాథం ఎయిర్ కండిషన్డ్ రూంలోకి వెళ్ళి వచ్చిన అతని క్రింది ఉద్యోగులూ అలాగే చేస్తారు. ఆ గది లోంచి బయటకు రాగానే వాళ్ళ రూపాన్ని చూడాలి. ఏదో దారుణమైన మార్పు - కార్టూన్ సినీమాల్లో లాగా - ముఖం వీపువైపు తిరిగిపోయినట్లో, తల బొంగరంలా తిరుగుతున్నట్లో లేక - సర్రియలిస్టు చిత్రాలలో లాగా - తల వెంట్రుకలు మంటలై పోయినట్లో, అరచేతులు చెమటలో కరిగిపోయినట్లో అనిపిస్తుంది చూసేవాళ్ళకి. అలా అయ్యాక మళ్ళీ మామూలు మనుషులు గావడానికి కొన్ని నిమిషాలు పడుతుంది.

ఆఫీసర్ వేణునాథం గొప్ప ప్రతిభాశాలి. అందుకే ముప్పై యేళ్ళు నిండకుండానే అంత పెద్ద హోదా అందుకున్నాడు ఈ ఆఫీసులో. చక్కని రూపం. అతి మెత్తని కాన్వెంటు ఇంగ్లీషు, చూస్తే ఎవరైనా మెచ్చుకుంటారు. ఆఫీసు భారం తనకి లెక్కలేదన్నట్లు వేణునాథం మేనేజ్‌మెంట్ పత్రికల్లో అనేక రీసెర్చి పేపర్లు కూడా వ్రాశాడు. అతనికి ఉన్నన్ని స్వదేశీ విదేశీ డిగ్రీలు ఉన్న వాళ్ళు దేశం మొత్తానికే పది మంది వుంటారేమో... కాని...

ఇవీ ఆఫీస్‌లో తన సీట్లో కూర్చుని 'ఎలక్ట్రానిక్ కాలిక్యులేటర్' మీద జీతాల బిల్లులు తయారు చేస్తున్న గుండూరావు తలలో మెదిలిన ఆలోచనలు " ఈ కంపెనీనీ స్థాపించి ఇంత చేసిన ఆ కేపిటలిస్టు దేవుడిలాగే మనకి కనపడ్డు. కాని అతగాడి పూజారులు రోజూ మన్ని చంపుకు తింటూ వుంటారు. వాళ్ళలో వేణునాథం టాప్

## ఆణిముత్యాలు

అనుకుని, వేణునాథం గదివేపు ఓసారి తీరికగా చూసి, మళ్ళీ కేలిక్యులేటర్‌కి అంకెల్ని తినిపించ సాగాడు. అతను. ఒక్కొక్క సంఖ్యా ముద్దుగా వెలగడం తరవాత మరొకటి కలవగానే ఇద్దరూ నిశ్శబ్దంగా కలిసిపోవడం, హెచ్చవేసి నప్పుడు ఊహించని పెద్ద సంఖ్య వచ్చి ఆశ్చర్య పరచడం - ఇవన్నీ గుండూరావుకి ఎంత చూసినా ఆనందమే. నిశ్శబ్దంగా వస్తాయి అంకెలు - నిద్రకళ్ళతో డ్యూటీకి వస్తున్న కార్మికులలా, వరసగా మాట్లాడని మల్లెమొగ్గలా, రాత్రి కురిసిన మంచు బిందువుల్లా నిద్దట్లో తల్లి కడుపులో ఏమీ అనలేక గిరగిరా తిరిగిన శిశువులా.

తప్పు అంకె నొక్కి వెంటనే దాన్ని ఎరేజ్

చేశాడు గుండూరావు. " ఈ ఆఫీసర్‌కి మేమంతా ఈ అంకెల్లాగా కనిపిస్తామేమో, నేనిప్పుడీ అంకెల మీద సర్వాధికారిని. నా ఇష్టం వచ్చిన అంకె నొక్కుతాను. చచ్చినట్లు వస్తుంది. వెంటనే దాన్ని ఎరేజ్ చేసేస్తా. అడ్రస్ లేకుండా పోతుంది" అనుకున్నాడు. "ఛీ వీడి గురించి క్షణం ఆలోచించినా మహాపాపం చుట్టుకుంటుంది!" అని మనస్సు మళ్ళించుకోడానికి కీచు గొంతుకతో పాట మొదలెట్టాడు. ఆఫీసులో వుండి కూడా కూని రాగాలు తీసేంత ఉక్కుమనిషి అతనొక్కడే. మిగతా వాళ్ళంతా ఎవరి పని వాళ్ళు చూసుకుంటున్నారు.

గుండూరావు టేబుల్ ముందు నుంచి ఓ నాజూకైన పరిమళం నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. ఆ 'సువాసిని' రాధ అని గ్రహించిన గుండూరావు వెంటనే పాట మార్చేసి మంచి ఫీలింగ్‌తో "మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా, నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగవలె నడిచిపో" అనే దాశరథి గీతం అందుకున్నాడు. ఎందుకంటే రాధ వేణునాథానికి స్టెనో. ఆమెకు "మాట్లాడని మల్లెమొగ్గ" అనే పేరుంది ఆఫీసులో.

వేణునాథాన్ని తిట్టడం, ఇతరులు తిడుతుంటే వినడం, వాళ్ళకి వంతగా మళ్ళీ తిట్టడం, తీరికవేళల్లో ఈ ఆఫీసువాళ్ళ నిత్యకృత్యం. ఏమీ మాట్లాడనిది రాధ ఒక్కతే.

వేణునాథం చక్కని ఇంగ్లీషులో ఉద్యోగులందర్నీ తిడతాడు. అతని తిట్లని దేంతోనూ పోల్చలేం. అవమానపు జల్లులే అతని మాటలు. ఆ నేర్పు పుట్టుకతో రావాలి. నేర్చుకుంటే రాదు. పైగా అతను ఎవర్నీ నలుగురి ముందరా తిట్టడు. "గుడ్ మేనర్సూ కాదు, వాడి పిండా కూడూ కాదు! షాక్ ఎఫెక్ట్ తగ్గి పోకూడదని! రాస్కెల్... అందుకే ఒక్కొక్కళ్ళనే రూంకి పిలిపించి మరీ తిడతాడు. నిజమేనండి, మిమ్మల్ని తిడుతుంటే ఆ తిట్లు మేమంతా వినేశామనుకోండి. అవి మాకు అలవాటైపోతాయి కదా. అలా కాకుండా రూంకి పిలిపించి మిమ్మల్ని ఒక్కర్నే తిట్టాడనుకోండి. అన్ని తిట్లూ మీకు తగులుతాయి. ఊపిరాడదు. అవి మేం వినంగా, మమ్మల్ని పిలిచినప్పుడు మాకు అతని అవమానం ఫ్రెష్‌గా అంటుకోవాలి. అదీ వాడి శాడిజం.." అని ఓసారి రామారావు వివరణ ఇస్తే అందరూ నిజమేనని ఒప్పుకున్నారు.

ఆఫీసుకి వచ్చేటప్పుడూ, తీరిక సమయాల్లోనూ, లంచ్ బ్రేక్‌లోనూ, ఇళ్ళకి వెళ్ళేటప్పుడూ వేణునాథాన్ని వేనోళ్ళ తిట్టడమే ఈ ఉద్యోగుల పని. ఎంత తిట్టినా కసి తీరదు వాళ్ళకి. వేణునాథం తిట్లలో ఓ శక్తివంతమైన భాష, శైలీ వున్నాయి. కీలెరిగి వాత పెట్టు అన్నట్లు ఎవర్ని ఎలా తిడితే మళ్ళీ తలెత్తుకోలేనంత అవమానం కలుగుతుందో అతనికే తెలుసు. అనితర సాధ్యం ఆ మార్గం. అతని టాలెంట్‌లో వందో వంతు కూడా తమకు లేదని వీళ్ళందరికీ తెలుసు. కాని కొంత బరువైనా తగ్గుతుందని నిత్యం అతన్ని తిడుతూ వుంటారు. రాధ మాత్రం ఒక్క మాట అనదు.

తన పై అధికారి వస్తున్నాడని తెలిసి ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళాడు వేణునాథం. ఉదయం పదకొండు అయింది. ఇక ఈ రోజసలు అతను ఆఫీసుకే రాడని తెలిసిన ఉద్యోగులకి గొప్ప ఆటవిడుపు అయింది. వేణునాథం కారు కాంపౌండు దాటిందో లేదో, ఆఫీసంతా పేకాట క్లబ్‌లా నాలుగు టేబిల్స్ దగ్గర చేరిపోయింది. గుండూరావు దగ్గరే ఎక్కువ మంది చేరారు, యెప్పట్లాగే. ఎందుకంటే గుండూరావుకి బుడుగు చెప్పినట్లు "పాపం తెలుగు రాదు." ఒచ్చీరాని తెలుగు కన్నడయాసతో మాట్లాడుతుంటే వినడానికి చాలా ముద్దుగా వుంటుంది. అతను తెలుగు నేర్చుకోడానికే కథలూ, కావ్యాలు తెగ చదువుతున్నాడు. అంచేత అతని భాష, మరీ నవ్వొస్తుంది వింటే.

గుండూరావు "క్లబ్" కార్యక్రమాలు మొదలయ్యాయి. కొందరు కుర్చీలు మోసుకు తెచ్చుకున్నారు. కొందరు అతని టేబులెక్కారు. "ఆఫీసంతా రణగొణ ధ్వని, రాముడి పెళ్ళి" అన్నట్లుంది. వాళ్ళు అరుస్తూ జోకులేస్తూ కూర్చున్నారో లేదో, వేణునాథం గదిలోంచి రాధ వచ్చి వాళ్ళ పక్కనించి ఆఫీసు చివరనున్న రెస్ట్‌రూంకి వెళ్ళిపోవడం జరిగింది. ఠీవిగా, రోల్స్ రాయిస్ కారులా, అందులో నిలుచుని వీళ్ళూ మనుషులేనా అనుకుంటూ పైకి నవ్వుతున్న ఓ రాణీలా నడిచి వెళ్ళిపోతున్న రాధని చూసి "దేవుడు అన్నీ ఒకళ్ళకే ఇస్తాడోయ్. అందం, డబ్బు, ఆరోగ్యం, ఠీవీ, గౌరవం, పొగరూ, హు అందుకే దేవుడు కేపిటలిస్ట్. కనుకనే మార్క్స్ నాస్తికు

డయ్యాడు" అని నిట్టూర్చాడు రామారావు, రాధని కనుమరుగయ్యే దాకా చూసి.

"అవును. రాధ చాలా అదృష్టవంతురాలు" అన్నాడు పంతులు.

"అదృష్టం అని మెల్లిగా అంటున్నావూ! అంత అదృష్టమే లేకపోతే వేణునాథం అంతటివాడు కూడా ఆమెని తిట్టకుండా వుంటాడా. మనకి రెగ్యులర్ కోటా కదా. పాత తిట్ల బొప్పెలు ఇంకా పోకుండానే కొత్తవి వచ్చేస్తాయి. ఆ పిల్లని మాత్రం అస్సలు తిట్టడు."

"తిట్టాడో లేదో నీకు తెలిసినట్లే మాట్లాడేస్తున్నావు ! వాస్తవాలు గ్రహించకుండా బాధ్యతా రహితంగా స్టేట్‌మెంట్స్ ఇవ్వకు నాయనా. రచయితవో, మినిస్టర్‌వో అయేదాకా ఆగు."

"అనుమాన ప్రమాణం అని ఒకటుందోయ్ చవటాయ్! దేవుడు లేడు అనేవాళ్ళు కూడా ఐన్‌స్టయిన్ గొప్పోడని ఒప్పుకుంటారు కదా. వీళ్ళు ఈతన్ని చూసే గొప్పవాడని అంటున్నారా? అసలతని రీసెర్చి ఏమిటో ఎందులో చేశాడో కూడా తెలియకుండా అతని భజన చేయటంలా? దాన్నే అనుమాన ప్రమాణం అంటారు."

"నీ బొంద ప్రమాణం. సరేకాని వేణునాథం రాధని తిట్టలేదని ఎందుకనుకున్నావు?"

"ఇంకా తెలీలేదురా? వేణునాథం తిట్టు ఒక్కటి పడితే చాలు. మన మొహం ఏసిడ్ పడినట్లు అవుతుంది కదా. రాధ డిక్టేషన్ తీసుకోడానికి రోజూ వెళ్ళి వస్తుంది కదా మొహంలో ఏమైనా మార్పుందా?

"ఎంత మాత్రమూ లేదు. గ్రీక్ శిల్పంలా అదే నిశ్చలత్వం. అదే అందం, అదే ఠీవి."

"ఆడవాళ్ళకి ఓర్పు యెక్కువంటారు. అంచేత వూరుకుంటోందేమో!"

"ఏ ఆడవాళ్ళండీ, ఆ రాక్షసుడి తిట్లని ఓర్చుకునేది?" అంటూ టైపిస్టు నిర్మల ముందుకు దూకింది. నిర్మల కూడా వేణునాథాన్ని తిట్టడంలో ఎక్స్‌పర్టే. "వాడు మనిషి కాదండీ, రాక్షసుడు. ఎందుకొచ్చిన చదువూ తెలివీ? అధికారం ఉంది కదా అని అంతలా యిన్సల్ట్ చేస్తాడా మనందర్నీ? వాడి నోటికి ఆడా మగా భేదం లేదండీ! పెద్దపులి అనుకుంటుందా, నేను మొగాళ్ళనే తింటాను, ఆడవాళ్లని తినను అని? అలాగే మన బాస్ గారూను" ఆపి ఉక్రోషంగా అతను తనని ఏయే రకాల మాటలతో అవమానించాడో పదోసారి పూసగుచ్చినట్లు చెప్పింది. దాంతో అందరూ ఎవరి కథలు వాళ్ళు చెప్పుకోసాగారు. మాటలు గాలికి పోవు. గాయాలు చేసి, వాటిలో చీములా ఉండి పోతాయి.

"మొన్న లేటెస్ట్ తిట్టు కథ విన్నారా. గిరిప్రసాద్ గారికి నలభై అయిదేళ్లొచ్చాక తొలి సంతానం కలిగింది కదా. అది వేణునాథానికి చెప్పనే లేదు. చెప్తే వాడేం మాటల బురద విసురుతాడో అని ఊరుకున్నాడు. అయినా ఎలా కనిపెట్టేడో ఆయన్ని పిలిపించాడు మొన్న ఉదయం. అందుకేనన్న మాట ఆయన సిక్ లీవ్ పెట్టేశాడు నిన్నట్నించి."

"అరె పాపం. ఏం జరిగిందేమిటి?"

"అన్నీ జరగాల్సినవే. పిలిచి "మీకు పెళ్లైన పాతికేళ్ళకి ఫస్ట్ ఇస్యూటగా. కంగ్రాచ్యులేషన్స్" అన్నాడుట. దాంతో ప్రసాద్‌గారు పొంగిపోయి " ఇక పుట్టరని గుండె రాయి చేసుకున్నాం సార్. అయినా చూద్దామని తీర్థయాత్రలు చేశాం - నేనూ నా భార్య. ఏ దేవుడు విన్నాడో మా మొర. వెంటనే నెల తప్పింది, అంతా పై వాడి దయ" అన్నాడుట. వేణునాథం నవ్వుతూ "బాగా చెప్పారు. అదే అదే! అంతా 'పై' వాడి దయ. నార్త్ ఇండియన్ అన్న మాట. హహహ! తీర్థయాత్రలు ఊరికే పోతాయటండీ. మీరు నెల్లాళ్ళ యాత్రల్లోనూ, రోజుకి ఇరవై గంటలూ మీ భార్యని కావిలించు క్కూచోలేదుగా. ఒక్క పది నిమిషాలు వెళ్ళనిస్తే చాలండీ కన్‌సెప్షన్ రావడానికి! అబ్బే, అంతెందుకు అర నిమిషం చాలు. ఇదేం నా సొంత అయిడియా కాదులెండి. చలం అని ఓ గొప్ప రచయిత ఉన్నాడు. అతని స్టైయిల్ నాకు చాలా ఇష్టం. గ్రేటెస్ట్ ఇన్ తెలుగు. అతను "స్త్రీ" అని ఓ పుస్తకం రాశాడు. అందులో క్లియర్‌గా రాశాడు –లేక లేక పుట్టిన పిల్లలంతా ఈ బాపతేనని. అబ్బే ఫాక్ట్‌కి సిగ్గుపడ్డం దేనికీ? ఫేక్ట్స్ ఆర్ సేక్రెడ్. పైగా చలం ఈ విషయాల మీద అథారిటీ... " అంటూ ఆయనతో చాలా సేపు "మాట్లాడాడుట". ఆ రోజు మీరెవరూ ఆయన్తో మాట్లాడలేదా? ఎలా మాట్లాడుతారు? వెంటనే సెలవు పెట్టి ఇంటికెళ్ళి పోయాడుగా. నేనింటికి వెళ్తే చెప్పాడు భోరున ఏడుస్తూ, అదీ వేణునాథం దెబ్బ అంటే."

"పరమ కిరాతకుడు. మాటల్లో ఎంత శక్తి వుంది!"

"అది శక్తేం కాదు, శక్తి అంటే మంచి చేసేదే."

"నీ వేదాంతానికేం గాని రాధ వేణునాధాన్ని అస్సలు పల్లెత్తు మాటనదు. అదెందుకో చెప్పు నీ అనుమాన ప్రమాణంతో."

"ఏముంది. సింపుల్. రాధని అతను తిట్టి వుండడు."

"కాదు సార్. రాధమ్మ గోర్నీ తిట్టాడు వేణునాధం. నేను విన్నానుగా. చాలాసార్లు తిట్టాడు. అమ్మగార్ని అందరికంటే యెక్కువే తిట్టాడు. విని విని కళ్ళు తిరిగాయి నాకు."

అప్పుడే వచ్చిన ఆఫీస్ బోయ్ తలుపులు ఉద్రేకంగా చెప్పాడు.

అందరూ ఆ వార్త విని షాక్ అయ్యారు. రాధ కూడా తిట్లు తిందా? అయినా వేణునాధాన్ని చాటు గానైనా తిట్టడం లేదు. ఇది మనుషులకు సాధ్యమా? రాధ భూమి మీదకు దిగివచ్చిన "దేవత", లేక అందర్నీ సొంత బిడ్డలుగా చూసుకునే "అమ్మ" అవతారమా?

మనుషులకి అన్నీ తెలుసుకోవాలనే వుంటుంది. తెలియని చోట్ల ఊహిస్తారు. రాధ వింత ప్రవర్తన అర్థంగాక రకరకాల థియరీలు వచ్చాయి. యిన్నాళ్ళూ, రాధ వేణునాధానికి చుట్టమనీ, రాధ మొగుడు ప్రకాష్ (అతనూ పెద్ద ఆఫీసరే మరో కంపెనీలో) వేణునాధానికి బాల్య స్నేహితుడనీ, కొన్ని రూమర్లు వచ్చి కొద్ది గంటల్లో అకాల మరణం చెందాయి, మంత్రుల వాగ్దానాల్లా. కొందరు ఆధునిక భావాలు గల ఉద్యోగులు, "ఇదంతా సెక్స్. వేణునాధానికీ రాధకీ ఏదో ఎఫైర్ ఉండచ్చు. అందుకే వాడు ఈవిడని తిట్టడు. ఈవిడా అందుకే ఏమీ అనదు. నో డౌట్. ఇది సెక్స్ లింకే." అని ప్రతిపాదిస్తే అతి సాంప్ర దాయికవాదులైన మరికొందరు తలలూపారు. అంతా సెక్సే అని ఫ్రాయిడ్ అంటే, ఆడదానికి మగాడి కంటే ఎనిమిది రెట్లు కామం అని సంప్రదా యంలో ఓ పిలక అంది. ఇలా రాధ అనేక కథలకు నాయిక అయింది. ఇప్పుడవన్నీ (తలుపులు ఇచ్చిన సాక్ష్యంతో) ఒట్టి ఊహాగానాలని తేలిపోయింది.

రాధ ప్రవర్తనకి కారణం తెలిసేదాకా ఎవరికీ తిండి సయించేలా లేదు. ఊపిరాట్టం లేదు. "ఆమెనే అడుగుట ఉత్తమం" అన్నాడు గుండూ రావు. అందరూ ఈ బ్రహ్మాండమైన అయిడియా ఇచ్చినందుకు అతన్ని అభినందించి, నిర్మల చుట్టూ చేశారు. "తల్లీ నువ్వే పూనుకోవాలమ్మా, రాధమ్మని అడగాలి" అని. ఏం అడగాలో ఎలా అడగాలో రిహార్సల్ చేయించారు.

నిర్మల తనకు సడెన్‌గా లభించిన స్థానానికి గర్విస్తూ, రాధ కూర్చున్న గదిలోకి వెళ్ళింది. రాధ చిరునవ్వుతో ఆహ్వానించింది. నిర్మల నేరుగా రాయబారంలోకి దిగిపోయింది.

నిర్మల చెప్తున్నదంతా రాతి బొమ్మలా కూర్చుని వింది రాధ. నిర్మల జవాబు కోసం మారాం చేయగా చేయగా " ఎందుకు తిట్టడం?" అంది కుప్తంగా.

"ఎందుకేమిటి. మేమంతా తిట్టటంలా? మాలాగే నువ్వూ అతని వల్ల అవమానింప బడ్డావుగా. ఎందుకు తిట్టవు?" సూటి ప్రశ్న వేసింది నిర్మల.

ఎంతకీ జవాబివ్వకుండా కూర్చుని ఉన్న రాధని చూసి రెచ్చిపోయి నిర్మల రాధని అయిదు నిమిషాలు ఏకటాకీగా నిందించింది. గీర అనీ, అందమైన దాన్నని గర్వమనీ, మొగుడు పెద్ద జీతగాడని పొగరనీ, వేణునాధాన్ని తిట్టడం మానేసి మహాత్ముడినని పేరు తెచ్చుకోవాలనే దురాశ అనీ నానా మాటలూ అంది.

అంతా రాతిబొమ్మలా విని "నాకు మన బాస్ తిట్లు వింటే జాలేస్తుంది నిర్మలా! అతను యెంత కష్టపడుతున్నాడో కదా అని" అంది రాధ.

తెల్లబోతూ "అతనికి కష్టమేముంది యిందులో. నోరు పారేసుకోడమేగా!" అంది నిర్మల.

"అదే అదే. అంత నోరు పారేసుకొంటాడా పాపం. కాని నాకు మావారు ఒకటి రెండు మాటలతో యింతకు వంద రెట్లు అవమానం చేయగలరు. నాకు పెళ్ళయినప్పట్నుంచీ అది అల వాటై వేణునాధం నన్ను యిన్సల్ట్ చేయగలననే ధీమాతో తిడుతుంటే నవ్వొస్తూ వుంటుంది. పరాయి వాళ్ళు యెంతటి వాళ్ళైనా మొగుడి సాటి రారు చెల్లాయ్."